క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం



చిప్పగిరిలో నిర్మాణం పూర్తయిన రైతు భరోసా కేంద్రం

చిప్పగిరి: మండల కేంద్రమైన చిప్పగిరిలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గతంలో వ్యవసాయ కార్యాలయం లేకపోవడంతో శ్రీ శక్తి భవనంలో వ్యవసాయ శాఖ అధికారులు విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం నూతన రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తి కావడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మండలంలోని గుమ్మనూరు, బెల్డోణ, దౌల్తాపురం, నగరడోణ, నేమకల్లు, రామదుర్గం, ఏరూరు, డేగులహాలు, తదితర గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు వివిధ దశలలో కొనసాగుతున్నాయి.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న స్నేహితులు

పత్తికొండ రూరల్: పత్తికొండలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మస్తాన్ కుటుంబానికి స్నేహితులు ఆదివారం రూ.85 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మస్తాన్ మృతి చెందడంతో భార్య ముగ్గురు పిల్లల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న మిత్రులు, పత్తికొండ ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ హాస్టల్ 2000-02 బ్యాచ్‌ల విద్యార్థులు చేయి చేయి కలిపి రూ.85 వేలు పోగు చేసి నగదును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

తుగ్గలి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఆదివారం త్రైత సిద్ధాంతంపై ప్రబోధ సేవా సమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. భగవద్గీత సూక్తులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో ఇతరులపై ప్రేమ తో మెలిగి మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. సమితి సభ్యులు రవికుమార్, మోహన్‌కృష్ణ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

గోనెగండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని హెచ్.కైరవాడి, పుట్టపాశం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రజలందరికీ అందించడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 17 వివిధ రకాల పథకాలను ఇప్పటికే అర్హులైన వారిందరికీ అందిస్తున్నామని, అర్హులై ఉండి పథకాలు అందని వారు ఉంటే వివరాలను ఈ యాత్రలో నమోదు చేయించుకోవాలన్నారు. ఎంఈఓ నీలకంఠ, పీఆర్ ఏఈ శ్రీనివాస రెడ్డి, ఈఓఆర్డీ నాగేష్, డాక్టర్ రవళి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భగవద్గీత శిక్షణ

ఆదోనిఅర్బన్: స్థానిక అవ్వ బ్యాంకు పక్కన ఉన్న భగవాన్ శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీలో సోమవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ భగవద్గీత శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాబోటి రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండితుడు శ్రీ సదాశివ పాణి శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి, నేర్చుకోవాలనుకునే వారికి వయోపరిమితి, జాతివర్గ లింగబేధం లేదని తెలిపారు. అందరూ అర్హులేనని, ప్రతిఒక్కరూ నేర్చుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వారిని ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సతీసమేతంగా గరుడ వాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని జ్వాలా తోరణాలతో స్వాగతం పలికారు. పెద్ద ఎత్తు న భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

దేవరగట్టులో కార్తీక మాస పూజలు

హొళగుంద: ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో కార్తీక మాసం రెండవ ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, భండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి విరాట్‌మూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులే కాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక అస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

జ్వాలాతోరణ దర్శనం సర్వ పాపహరణం

ఆస్పరి: మండలంలోని బిణిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం రాత్రి జ్వాలాతోరణం, దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో పంచలింగేశ్వర స్వామికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి చేపట్టారు. ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జ్వాలా తోరణంను వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్, మహి తదితరులు వెలిగించారు. జ్వాలా తోరణం దర్శణంతో సర్వపాపాలు హరించబడి, కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి తెలిపారు. స్వామి వారి పల్లకీని ఊరేగించారు. ఆలయం ఆవరణలో భక్తులు దీపాలు వెలగించారు. మండలంలోని ఆస్పరి, చిగిళి, నగరూరు, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, తంగరడోణ, ఆదోని తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుంగా హారతి

నందవరం: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు హంపేష్ స్వామి తెలిపారు. సోమవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉదయం ఆది దంపతులకు నమక చమక పూజలు, పంచమృతాభిషేకాలు గావిస్తారు. సాయంత్రం 4 గంటలకు శ్రీ వాసవి లలితా పూజామండలి సభ్యులచే విష్ణుసహస్త్ర నామ పారాయణం, సాయంత్రం 5 గంటలకు తుంగా హారతి, 6 గంటలకు జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు పురోహితులు తెలిపారు.



పెరవలిలో గరుడవాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు



బిణిగేరిలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు



గురజాల రామలింగేశ్వర స్వామి

దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి శోభ



తాపలకొత్తూరు విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఓంకారం ఆకారంలో దీపాలు వెలిగించిన దృశ్యం

కృష్ణగిరి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు శివపార్వతులకు అభిషేకార్చనలు చేశారు. చుంచుఎర్రగుడి గ్రామంలోని పురాతన దేవాలయమైన రామప్ప దేవాలయంలో రామలింగేశ్వర స్వామికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాపలకొత్తూరులో నూతనంగా నిర్మించిన విశ్వేశ్వర స్వామి దేవాలయం ముందు గ్రామస్తులు శివలింగం, ఓంకారం ఆకారంలో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

కృష్ణగిరి: ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) నూతన మండల కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. సమాఖ్య జిల్లా నాయకుడు యూఆర్‌ఏ రవికుమార్ ఆధ్వర్యంలో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రామ్మూర్తి, నాగరాజు ఎన్నికయ్యారు. గౌరవ ప్రతినిధులుగా శేషారెడ్డి, నారాయణరెడ్డి, ప్రతినిధులుగా రాజ్‌కుమార్, హసీనా, సురేశ్‌లతో పాటు కౌన్సిలర్లుగా రాములు, మోహన్, దుర్గాప్రసాద్, పద్మావతమ్మ, మహిళా విభాగం, ఆడిట్, సీపీఎస్, అకాడమిక్ విభాగం, సాంస్కృతిక విభాగం కన్వీనర్లుగా హరిత, రమేష్, కృష్ణుడు, శివప్రసాద్, అయ్యన్న, మరో 11 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల స్థాయి కమిటీలను సైతం ప్రకటించారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరాడతామని నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేశారు.

28న హిందూ ధర్మ సమ్మేళనం

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 28వ తేదీన సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రచార కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పండితులు గురురాజ శాస్త్రి (రవిశాస్త్రి), జే.హొసళ్లి గ్రామంలో పురవర్గ మఠం పీఠాధిపతి అజాత శంభులింగ శివచార్యులు, మల్లికార్జున స్వామి, గవిసిద్దయ్య స్వామి, పెద్దహోతూరు గ్రామ ఉచ్చీరప్పతాత మఠం చంద్రమౌళీ స్వామి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భీమలింగేశ్వర స్వామి ఆలయం నుంచి ఆలూరుకు రెండు కి.మీ దూరంలో ఉన్న బెళ్లగుండ ఆంజనేయ స్వామి ఆలయం వరకు స్వామివారి ఊరేగింపు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

కల్వర్టు దిమ్మెలు ధ్వంసం



పత్తికొండ-పందికోన రోడ్డులో ధ్వంసమైన కల్వర్టు దిమ్మెలు

పత్తికొండ రూరల్: పత్తికొండ-పందికోన రోడ్డులోని కల్వర్టు దిమ్మెలను ఆదివారం కొందరు దుండగులు ధ్వంసం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పంటపొలాల గూండా పారే వర్షపు నీరు వెళ్లేందుకు అనువుగా అప్పట్లో కల్వర్టు నిర్మాణం జరిగింది. దీనికి అనుగుణంగా రెండు సిమెంట్ దిమ్మెలను ఏర్పాటుచేశారు. దారి వెంట కాలినడకన వెళ్లే వారు విశ్రాంతి తీసుకునేందుకు అనువుగా ఉండేవి. అయితే గుర్తు తెలియని కొందరు ఉద్దేశ్యపూర్వకంగా గడ్డపారలతో కొట్టడంతో సిమెంట్ దిమ్మెలు విరిగిపడ్డాయి. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచితంగా న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి గురుఅరవింద్

ఎమ్మిగనూరుటౌన్: న్యాయవాదులను నియమించుకునే స్థోమత లేని పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందించడం జరుగుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురుఅరవింద్ సూచించారు. రాజ్యాంగ దినోత్సవంతో పాటు జాతీయ న్యాయ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాల, బాలికల వసతి గృహం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జడ్జి మాట్లాడుతూ.. కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఉంటుందని, వారిని ఆశ్రయిస్తే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాజ్యాంగం, వరకట్న నిషేధంపై వివరించారు. పట్టణ ఎస్‌ఐ రమేష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, న్యాయవాది లింగమూర్తి పలు చట్టాలు, శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. న్యాయవాదులు రంగనాథ్, రామకృష్ణ, సాల్మాన్, రామాంజనేయులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం



నూతన కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ-స్టేట్ టీచర్స్ యూనియన్) వెల్దుర్తి మండల నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గంధం నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షుడిగా హుస్సేన్ మియ్యా, ప్రధాన కార్యదర్శిగా మూర్తుజావలి, ఆర్థిక కార్యదర్శిగా రామాంజనేయులు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా రాజశేఖర్, మాదన్న, నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గంధం నాగరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు చిన్న పొరపాట్లకు ఇచ్చిన ఛార్జ్ మెమోలను ఉపసంహరించుకోవాలని, సీపీఎస్/జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలు, డిమాండ్లపై పోరాడాలని తీర్మానించారు. రెండు మండలాల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



హొళగుంద బస్టాండ్‌లో అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపిన వారిని హెచ్చరిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

హొళగుంద: బస్టాండ్‌లో ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు వాహనదారులు, దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఆయన ఆదివారం హొళగుంద బస్టాండులో పర్యటించి దుకాణాల ముందు అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాల యజమానులను హెచ్చరిస్తూ ప్రజలకు, మహిళల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను క్రమ పద్ధతిలో నిలపాలని సూచించారు. బస్టాండ్ స్థలంలో మోటర్‌సైకిళ్లు ఇతర వాహనాలను నిలపడం వల్ల ప్రజలు పలు అగచాట్లకు గురౌతున్న విషయంపై ఈ నెల 14న 'సాక్షి' పత్రికలో 'బస్టాండు మధ్యలోనే బైకులు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదివారం సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. దుకాణాల యజమానులు తమ షాపుల ముందు ఇతర వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీధి నాటకాలను ప్రోత్సహిద్దాం



హొళగుందలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కళాకారులు

హొళగుంద: దశాబ్దాల కాలం క్రితం నుంచి పూర్వీకులు ఆదరిస్తున్న వీధి నాటకాలను ఈ తరం వారికి అందిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు పిలుపునిచ్చారు. వారు ఆదివారం హొళగుంద పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న హొళగుందలో జరిగే 'కర్ణార్జున రాళగ' అనే కన్నడ బయలు నాటకానికి సంబంధించిన పోస్టర్‌ను కళాకారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఇప్పటికీ కన్నడ నాటకాలు, వీధి నాటకాలపై ఆసక్తి ఉందన్నారు. అభిమానులు ఈ నాటక ప్రదర్శనకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు రంగప్ప, సిద్దయ్య, రామకృష్ణ, లక్ష్మన్న, కళాకారులు రొడ్డె మల్లయ్య, ఆయకల్ తాయప్ప, మల్లికార్జున, పూజారి దేవన్న, దబాడి సిద్దయ్య, దేవన్న, మల్లయ్య, హుసేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళం అందజేసి భక్తిని చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన ఇల్లూరు వినయ్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.45 వేల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. ఆలయ సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారిఖ్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. ఆదివారం సెలువు రోజు కలిసి రావడంతో దర్గాకు భక్తులు అధికంగా వచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వైష్ణవి

కౌతాళం: రాష్ట్రస్థాయి పోటీలకు హాల్వి జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సారథి తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వైష్ణవి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 29 వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే ఖోఖో పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి వైష్ణవిని ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

పత్తికొండ రూరల్: కార్తీక పౌర్ణమి వేడుకలను మండల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో స్వామి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నైవేద్యం సమర్పించి గౌరీనోములు ఆచరించారు. రాత్రి ఇంటి ముందు మహిళలు వెలిగించిన దీపాలతో పలు వీధులు దీపకాంతులతో ధగధగలాడాయి.

క్రైం కార్నర్

పశుగ్రాసం తరలిస్తూ మృత్యువాత



మృతి చెందిన కురవ బుడ్డప్ప

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలో కురవ బుడ్డప్ప (34) అనే రైతు పశుగ్రాసం తరలిస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన కురవ బుడ్డప్ప పశుగ్రాసం కోసం ఎమ్మిగనూరుకు వెళ్లాడు. పశుగ్రాసం (వరి గడ్డి) ట్రాక్టర్‌పై తీసుకొస్తుండగా ముగతి గ్రామ సమీపంలో గుండెపోటుకు గురయ్యాడు. ట్రాక్టర్ నడుపుతుండగా నొప్పి రావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వేశాడు. నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిపోయి మృత్యువాత పడ్డాడు. స్థానికులు వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మృతుడు బుడ్డప్పకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆదోని బైపాస్ రోడ్డు నాగప్పల కట్ట ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఈ నెల 21వ తేదీన విద్యుదాఘాతానికి గురైన ప్రతాప్ అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు బంధువులు ఆదివారం తెలిపారు. స్టూడియోలో ఉన్న పెద్ద ఇనుప కడ్డీను కిందకు తీసుకువస్తుండగా ప్రమాదవశాత్తు షాప్ పక్కనున్న విద్యుత్ తీగలకు తగలడంతో ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం





ఆలూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి తదితరులు, ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, ఎంపీపీ కేశన్న, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పలు సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మిగనూరు ఎస్టీయూ కార్యాలయంలో ఆ యూనియన్ నాయకులు, నందవరంలో గ్రంథాలయంలో సర్పంచ్ తోట సావిత్రి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, గ్రంథాలయ శాఖ అధికారి శివరామప్రసాద్, గోనెగండ్లలో న్యాయవాదులు, జర్నలిస్టులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం పలు చోట్ల రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ, సర్పంచ్ ముత్యాల శైలజ, తెలుగు రమేష్, తదితరులు పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు వీరు ఈఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. తుగ్గలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఈఓపీఆర్డీ తిరుపాల్ ఆధ్వర్యంలో, మద్దికెర రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నాగభూషణం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. మద్దికెరలో ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులతో గ్రామ పురవీధులు గుండా ర్యాలీ నిర్వహించి మహాత్మా గాంధీ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు.

ఆలూరు: భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దేశానికి దార్శనికుడిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ నారాయణస్వామి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్ల నేడు అట్టడుగు వర్గాల వారికి సైతం అన్ని రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయన్నారు. బడుగుల తలరాతను మార్చిన ఘనత అంబేడ్కర్‌కు దక్కుతుందన్నారు. ఎంపీపీ రంగమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవరాజ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీ మాదన్న, గంగాధర్‌రెడ్డి, వరుణ్, లక్ష్మి నారాయణ తదితరులు ఉన్నారు. అలాగే హాలహర్విలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో, బాపురంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో, ఆస్పరి సచివాలయంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో, అరికెర గురుకులంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో, హొళగుందలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎంపీటీసీ మల్లికార్జున ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెల్దుర్తి పాతబస్టాండులో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, నాయకులు



అరికెర గురుకులంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు